నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



చందానగర్: వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

◆ బాంబే ఎక్స్ రోడ్డు ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఓల్డ్ బాంబే రోడ్డు, వేముకుంట, రామ్‌రాజ్ కాటన్‌షోరూం వెనుక, బీహెచ్‌ఈఎల్ మెయిన్ రోడ్డు, గౌతమీనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో.. చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

◆ ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఆదిత్యానగర్, ఎస్‌సీబి కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్, కృష్ణ కాలనీ ఏరియాలలో..

◆ సాయిరాంనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రజయ్ సిటి, ఇండస్ట్రీయల్ ఏరియా, దేవి హోమ్స్, భాను టౌన్‌షిప్, సత్యభారతీ ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇజ్జత్‌నగర్ విలేజ్, శిల్పాహిల్స్ రోడ్ నెంబర్ 1,2,3, సన్‌షైన్ అపార్ట్‌మెంట్స్, అపర్ణ విల్లాస్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా దూబే కాలనీ, గుల్‌మొహర్ పార్కు కాలనీల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట నారాయణరెడ్డి తెలిపారు.

◆ 11 కేవీ దూబే కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు.. ఆదర్శనగర్, గోపీనగర్, నెహ్రూనగర్, దూబేకాలనీ, శాంటామరియా ఇంటర్నేషనల్ స్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

◆ 11కేవీ గుల్‌మొహర్ పార్కు ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గుల్‌మొహర్‌పార్కు కాలనీ, జీహెచ్‌ఎంసీ ఆఫీస్, అలింద్ కంపెనీ, నేతాజీనగర్ ఏరియాల్లో..

◆ అలాగే రాజీవ్ గృహకల్ప, రాజీవ్ స్వగృహ, పాపిరెడ్డి కాలనీ ఫీడర్ల పరిధిలో.. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ సుమన్ తెలిపారు.

◆ 11 కేవీ రాజీవ్ గృహకల్ప ఫీడర్ పరిధిలో.. రాజీవ్ గృహకల్ప ఏరియాలో విద్యుత్ ఉండదు

◆ 11 కేవీ రాజీవ్ స్వగృహ ఫీడర్ పరిధిలోని ఆరంభ్ టౌన్ షిప్ అపార్టుమెంట్‌లో.

◆ 11కేవీ పాపిరెడ్డి కాలనీ ఫీడర్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, పరిసర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి రథోత్సవం





కేరళ చండీమేళంతో ఊరేగింపు..

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం జగద్రక్షక శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయ దశమ వార్షికోత్సవాలు చివరి రోజు సోమవారం వైభవంగా ముగిశాయి. అష్టోత్తర శత (108) కలశ మండపారాధన, పంచామృతాభిషేకము, అష్టద్రవ్యాభిషేకం, బొమ్మల కొలువు, 416 కేజీల పిండి వంటల నైవేద్యం సమర్పించారు. వేడుకలో భక్తులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. వార్షికోత్సవాలలో భాగంగా అయ్యప్ప స్వామి విగ్రహ ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాణసంచా, అయ్యప్ప స్వామి నృత్యాలు, మహిళల కోలాటలతో సాగింది. ప్రత్యేకంగా కేరళ చండీమేళం భక్తులను ఆకట్టుకుంది. ఆభరణాలు తీసుకువచ్చే తీరును ఆకట్టుకుంది. అయ్యప్ప స్వామి శరణఘోషతో ఆ ప్రాంతం మారుమోగింది.

రెడ్డి ఫౌండేషన్‌కు కాంటినెంటల్ ఆస్పత్రి విరాళం

మణికొండ: పేద రెడ్డి విద్యార్థుల చదువుకు కాంటినెంటల్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి రూ. 5లక్షల విరాళం అందజేశారు. సోమవారం ఆయనను కలిసిన మణికొండ రెడ్డి ఫౌండేషన్ నాయకులు చేస్తున్న సేవలను అడిగి తెలుసుకుని రెడ్డిలలో ఉన్న పేద విద్యార్థుల చదువులు, దుస్తులు తదితరాల కోసం ఆయన తన వంతుగా విరాళం అందజేశారు. ఇంటర్మీడియట్ ఆపై చదువుకునే విద్యార్థులకు అవసరమైన డిజిటల్ ఎక్విప్‌మెంట్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులకు ఆరోగ్య సమస్యలు వస్తే కాంటినెంటల్ ఆసుపత్రిలో గోల్డ్ కార్డు ద్వారా రాయితీలతో పాటు తక్కువ ఖర్చుతో అన్ని రకాల చికిత్సలు అందిస్తామన్నారు. సభ్యుల పిల్లలు గ్యాడ్యుయేట్స్ అయితే వారికి ఇంటర్న్‌షిప్‌తో శిక్షణ పొందే సౌకర్యాలను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు రెడ్డి ఫౌండేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మణికొండ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కె. నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సుభాష్ చంద్రారెడ్డి, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా..?



మక్తమహబూబ్‌పేట్ గ్రామంలో రోడ్డు దుస్థితి

మియాపూర్: మియాపూర్ డివిజన్ కాలనీ, బస్తీలలో ప్రధాన, అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసినా గుంతలమయమైన రోడ్లు ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అవినీతివల్ల రోడ్డు పనుల్లో నాణ్యత లోపంతో అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంకర తేలిన రోడ్లలో ప్రయాణించాలంటే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం తవ్విన రోడ్లను మరమ్మతులు చేయకపోవడం, పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా రోడ్లను తవ్వి వాటిని సరిగ్గా పూడ్చకపోవడంతో భారీ వర్షాలకు ఏర్పడిన గుంతలకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.



దీప్తిశ్రీనగర్- శాంతినగర్‌కు వెళ్లే రోడ్డులో ఏర్పడ్డ గుంతలు

◆ మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్, లక్ష్మీకాలనీ, రెడ్డి కాలనీ, బీకే ఎన్‌క్లేవ్, న్యూ కాలనీ మక్త మహబూబ్ పేట్ ఇలా పలు కాలనీలలోని ప్రధానరోడ్లతో పాటు అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయి.

◆ ప్రధాన రహదారులు ,అంతర్గత రహదారుల్లో ఇష్టానుసారంగా తవ్వి పనులు పూర్తయ్యాక పట్టించుకోకపోవడంతో గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

◆ దీప్తీశ్రీనగర్ -శాంతినగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో అడుగడుగునా రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. పలుమార్లు మరమ్మతులు చేసినా నాణ్యత పాటించకపోవడంతో మూణ్నాళ్లకే గుంతలు పడుతున్నాయి. ఈ రోడ్డుపై కంకర, ఇసుక తేలడంతో వాహనాల రాకపోకలకు దుమ్ము లేస్తుండడంతో ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ శాంతినగర్ కాలనీలో గత రెండు నెలల కిందట అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పగిలి రోడ్డు కుంగిపోయింది. అధికారులు పైప్‌లైన్ బాగు చేసి రోడ్డును తవ్విన ప్రాంతంలో మట్టి పోసి వదిలేశారు. మట్టి కుప్పలను చదును చేయకపోవడంతో ఈ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

◆ మక్తమహబూబ్‌పేట గ్రామం నుండి చెరువుకట్టకు వెళ్లే రోడ్డు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పనుల నిమిత్తం తవ్వి పనులు చేపట్టారు. మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి.

◆ మియాపూర్ విశ్వేశ్వర కాలనీలో పోలీస్ స్టేషన్ ముందు రోడ్డును తవ్వి డ్రైనేజీ పైప్‌లైన్లు వేశారు. తవ్విన ప్రాంతంలో చేపట్టిన మరమ్మతుల పనుల్లో నాణ్యతలేకపోవడంతో కొద్ది రోజులకే గుంతలు ఏర్పడ్డాయి. కాగా పలు ప్రాంతాల్లో రోడ్లు వేసిన కొన్ని రోజులకే పైప్‌లైన్ పనుల కోసం రోడ్లను తవ్వేస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని లక్షలాది రూపాయలతో రోడ్లు వేసి తవ్వినా పట్టించుకోకపోవడం ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



శాంతినగర్ కాలనీలో..

ప్రత్యేక పూజలు



చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడ గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వినోద్‌రావు, గౌతమ్‌గౌడ్, సంజీవరెడ్డి, చంద్రకాంత్‌రావు, ప్రసాద్, యాదగిరి, శ్రీధర్, శంకర్, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఉపాధి

శంషాబాద్ రూరల్: మత్స్యకారులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని నర్కూడ శివారులోని మల్లెమోని చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వందశాతం రాయితీపై అందజేస్తుందని తెలిపారు. నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మనూలో ‘డిజిటల్ సెక్యూరిటీ లెర్నింగ్

రాయదుర్గం: డేటా రక్షణ చట్టాలను అర్థం చేసుకోవడం అవసరమని ప్రముఖ న్యాయ నిపుణుడు సయ్యద్ హారూన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో, సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ (ఎస్ఎఫ్ఎల్‌సీ డాట్‌ఇన్) సహకారంతో ‘డిజిటల్ సెక్యూరిటీ లెర్నింగ్’ అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా ఉల్లంఘనలు, గోప్యత హక్కులు, ఎలక్ట్రానిక్ పరికరాల శోధన, సీజ్‌ని నియంత్రించే నియమాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ బెదిరింపుల నుంచి వినియోగదారులను ఎలా రక్షిస్తాయనే విషయాన్ని ఆయన వివరించారు. ఎస్ఎఫ్ఎల్‌సీ సాంకేతిక నిపుణుడు విఘ్నేష్ మాట్లాడుతూ డిజిటల్ భద్రతకు సంబంధించిన కీలక చట్టపరమైన, సాంకేతిక అంశాలను వివరించారు. వ్యక్తిగత డేటా ఎలా సేకరించబడుతుందో, విశ్లేషించబడుతుందో, దుర్వినియోగం చేయబడుతుందనే అంశాలపై అవగాహన కల్పించారు. డేటా ప్రొఫైలింగ్ అనే ప్రక్రియను ముప్పు మోడలింగ్ కన్‌క్రిప్షన్, సోషల్ మీడియా ఖాతాలను భద్రపర్చడంపై పలు సలహాలను అందించారు. స్పైవేర్, స్టెక్‌వేర్ నుంచి రక్షించే మార్గాలను కూడా వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ‘మనూ’ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ సైబర్‌స్పేస్‌లో పెరుగుతున్న ప్రమాదాల గురించి విద్యార్థులు, అధ్యాపకులకు మరిన్ని అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శివాలయాలు



ఇందిరానగర్‌లోని ఐహెచ్‌డీపీ ఆలయంలో..



రామలింగేశ్వర దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు

రాయదుర్గం: కార్తీకమాసం మూడో సోమవారం శివాలయాలు కిటకిటలాడాయి. పూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు తెల్లవారుజామునుంచే కార్తీక దీపాలను వెలిగించారు. శివసాయిక్షేత్రం, జీపీఆర్ఏ క్వార్టర్స్ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆకాశదీపాలు వెలిగించారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని జె.పి కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం, టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయాల్లో సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఉమామహేశ్వర దేవస్థానం, శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, భస్మాభిషేకం చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, డీఈ విశాలాక్షి

రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడతామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి అవంతిక గోదావరి అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో రూ.49.75 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన, జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు, స్థానికులతో కలిసి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డీఈ విశాలాక్షి, సీనియర్ నాయకులు కిరణ్, భాను, ప్రకాశ్, కిరణ్ కుమార్, లోకేందర్‌రెడ్డి, రమేష్, ధీరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గచ్చిబౌలి: ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వెళుతూ కింద పడడంతో తలకు గాయమై మహిళ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈసీఐఎల్‌లో నివాసం ఉంటూ బ్యూటీషియన్‌గా పని చేసే అనూష(36) ఆదివారం మేకప్ చేసేందుకు గచ్చిబౌలికి వచ్చింది. రాత్రి 10.30 గంటలకు స్కూటీపై తిరిగి వెళుతుండగా షేక్‌పేట్ ఫ్లై ఓవర్‌పై డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయింది. తలకు గాయం కావడంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అంధకారం.. భయం.. భయం



ఆంజనేయనగర్

చీకట్లో మూసాపేట, బాలాజీనగర్ డివిజన్లు

మూసాపేట: మూసాపేట, బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సాయంత్రం 6 దాటిందంటే చీకట్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలల నుంచి సమస్య ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో మెట్రో స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లాలంటే భయమేస్తోందని మహిళలు వాపోతున్నారు. షిఫ్టులు ముగించుకుని రాత్రి 9, 10 గంటలకు చీకట్లో ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారు.

స్టాక్ లేదు.. సామగ్రి లేదు..

కొత్తలైట్లు ఏర్పాటుకు, పాత వాటికి మరమ్మతులు చేయడానికి సామగ్రి లేదని అధికారులు చెబుతున్నారని స్థానిక ప్రజలు తెలిపారు. కాగా పది రోజుల నుంచి సామాగ్రి వస్తుండటంతో పాత ఫిర్యాదులను ముందుగా మరమ్మతులు చేస్తూ వస్తున్నామని అధికారులు తెలుపుతున్నారు. మున్సిపల్ ఎలక్ట్రికల్ అధికారులకు లైట్లు ఇతర గత ఆరు నెలల నుంచి సామాగ్రి రావటం లేదని పలువురు ప్రజలు, అధికారులు తెలిపారు.

చీకట్లో వెళ్లాలంటే భయం..

మూసాపేట అంజయ్యనగర్‌లోని సాయిబాబా ఆలయం రోడ్డులో మెట్రో స్టేషన్ ఉండటంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. మహిళలు కూడా రాత్రి సమయంలో తమ విధులు ముగించుకొని రాత్రి 9,10 గంటలకు మెట్రో దిగి ఆలయం ముందు నుంచి నడుచుకుంటూ నరసింహస్వామి ఆలయం వరకు వెళుతుంటారు. అయితే మెట్రోస్టేషన్ వద్దకు వచ్చే దారిలో మూడు లైట్లు వెలగడం లేదు. నెలల తరబడి సమస్య ఉన్నది. పలుమార్లు మున్సిపల్ అధికారులకు నేరుగా, ఆన్‌లైన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదని స్థానికులు తెలిపారు. మహిళలు చీకట్లో భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాక ఇదే రూట్‌లో ఆటోమేటిక్ టైమర్ కూడా పనిచేయకపోవడంతో రాత్రి 8 గంటలకు లైట్లు వెలుగుతున్నాయి. ఎప్పుడు ఆగిపోతాయో .. ఎప్పుడు వెలుగుతాయో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. లైట్లు ఉన్నా లేనట్లే ఉందని టైమర్‌ను బాగుచేయాలని కోరుతున్నారు. అలాగే ఆంజనేయనగర్‌లోని మరనాత ఆశ్రమం నుంచి పార్కుకు వెళ్లే దారిలో మూడు ప్రధాన కూడళ్ల వద్ద లైట్లు వెలగడం లేదు. ఆ ప్రాంతంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రగతినగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో జనతానగర్, వడ్డెరబస్తీ, యాదవ బస్తీ, వార్డు కార్యాలయం సమీపంలోని పలు ప్రాంతాల్లో లైట్లు వెలగడం లేదని తెలిపారు. ప్రతి 8 లైట్లలో 2 లైట్లు వెలగటం లేదు.

ఫిర్యాదులు వస్తున్నాయి.. మరమ్మతులు చేస్తున్నాం..

లైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వెంటనే స్పందించి మరమ్మతులు చేస్తున్నాం. బుధవారం వరకు ప్రధాన ప్రాంతాల్లో మరమ్మతులు చేస్తాం. మిగతా ప్రాంతాల్లో కూడా సమస్యలు పరిష్కరిస్తాం.

– స్వప్న, మున్సిపల్ ఎలక్ట్రికల్ ఆఫీసర్



పాపనాశేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారి



ఆంజనేయ నగర్‌లో..



శివాలయం, సాయిబాబా మందిరానికి వెళ్లే రోడ్డు

ప్రజావాణి.. 2 ఫిర్యాదులు



కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ముకుందర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో ప్రజలు రెండు ఫిర్యాదులు అందజేశారు. టౌన్ ప్లానింగ్ , ఇంజనీరింగ్ సెక్షన్లకు ఒక్కో ఫిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ దుర్గా ప్రసాద్, ఏఎంసీలు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, సంజయ్, ఉప వైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి, అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్- 2024 ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ఎంఈఓ వెంకటయ్య

చందానగర్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్– 2024 (క్రీడా ఉత్సవాలు) కార్యక్రమాన్ని ఎంఈఓ వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎండీ ఇబ్రహీం, లయన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆచార్య, శ్రీనివాస్, శంకర్, రెహమాన్, అనిల్ కుమార్, ఎన్ఎస్‌రావు, భీష్మారెడ్డి, భరత్‌కుమార్, రాజు, విజయ్, ప్రద్యుమ్న, ప్రవీణ్, పవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల నిరసన



లింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

శేరిలింగంపల్లి: ప్రభుత్వ నిర్ణయాలను నిరసిస్తూ సోమవారం లింగంపల్లి రైల్వే స్టేషన్ ఆటోడ్రైవర్స్ ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షులు దేవులపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శి రాజులు మాట్లాడుతూ ఓలా, ఊబర్, రాపిడో వంటి వాహనాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణికులను తీసుకెళ్ళడం వలన తమ ఉపాధి దెబ్బతింటోందని, అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ఉపాధి కోల్పోతున్నామన్నారు. ప్రభుత్వం పరిశీలించి న్యాయం చేయాలనికోరారు. ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు.

ముగిసిన ఏబీవీపీ పీపీఎల్ క్రికెట్ టోర్నీ

మెన్స్ విజేతగా 9 ప్రిడేటర్స్ ● విమెన్స్ విజేతగా గల్లీ గాళ్స్



ఏబీవీపీ పీపీఎల్ క్రికెట్ టోర్నీ మెన్స్ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు బాలకృష్ణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిషద్ ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) క్రికెట్ పోటీలు ముగిశాయి, విజేతలకు ఏబీవీపీ హెచ్‌సీయూ నాయకులు బహుమతులను అందించారు. మెన్స్‌విభాగంలో విజేతగా 9 ప్రిడేటర్స్, రన్నరప్‌గా లైగర్స్, విమెన్స్ విభాగంలో విజేతగా గల్లీగాళ్స్, రన్నరప్‌గా సీసీ‌స్ట్రైకర్స్ నిలిచారు. కార్యక్రమంలో విజేత, రన్నరప్ కెప్టెన్లు సుదీప్, శరణ్, సింధూజ, టోర్నీ కోఆర్డినేటర్లు సుదీప్, జ్వాల, సందీప్ వ్యవహరించగా ఎస్ఈసీ సభ్యురాలు ఆయేషా, ప్రతినిధులు గోకుల్, శుక్లా, వసంతరాథోడ్, వైష్ణవి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

అదనపు కలెక్టర్ మాధురి



క్రీడలను ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి అండర్ -14, అండర్-19 క్రీడా పోటీలను అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్‌లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ క్రీడా పోటీలలో 15 పాఠశాలలు,10 కళాశాలలకు సంబంధించి 650 మంది విద్యార్థులు పాల్గొన్నారని, మూడు రోజులపాటు ఈ క్రీడలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్సీఓ గౌతంకుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నవనీత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్‌కు వినతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్మశానవాటికలో ఉన్న బోర్ పని చేయడం లేదని వెంటనే మరమ్మతులు చేయించాలని రాజేంద్రనగర్ గ్రామ అధ్యక్షులు శ్రీకాంత్ ముదుమాల, యువజన నాయకులు శంకర్, మనోహర్, మహేశ్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శ్మశాన వాటికలో నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462